


# తండ్రి

**మూలవాక్యము:- కీర్త 89:26** నీవు నా తండ్రివి నా దేవుడవు నా రక్షణ దుర్గము అని అతడు నాకు మొఱ్ఱపెట్టును.

ప్రభువు నందు ప్రియమైన వారలారా, మన దైనందిన జీవితములో తండ్రి పాత్ర ఎంత కీలకమైనదో మనకందరికి తెలుసు, నవమాసాలు మోసి తల్లి బిడ్డలకు జన్మనిస్తుంది. తదనంతరము ఆ బిడ్డలను పెంచి పెద్ద చేసి ప్రయోజకులను చేయటంలో తల్లిదండ్రులు ఇరువురు ఎంతో ప్రయాసపడతారు. అయితే అది అంత సులువైనది ఏమి కాదు.బిడ్డలకు మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసం,వారిని పెంచుటకు, పోషించుటకు దివారాత్రులు శ్రమిస్తారు. బిడ్డల జీవితాలను ప్రభావితం చేయడంలో తల్లి పాత్ర ఎంత ఉంటుందో తండ్రి పాత్ర తన పిల్లలపైన మరింత ఎక్కువ ప్రభావంతముగా పని చేస్తుంది.

పరిశుద్ధ గ్రంధం మనకు ఏమి బోధిస్తుందంటే మన శరీరమునకు ఒక తండ్రి ఉన్నట్లే, మన సృష్టికర్తయైన దేవుడు మన ఆత్మలకు తండ్రియైయున్నాడు. ఈ సత్యాన్ని మనం అంగీకరిస్తే మన ఆత్మలకు తండ్రియైన దేవుడు మన జీవితాల్లో ఎంతో ప్రభావవంతముగా పని చేస్తాడు. గనుక ఆ పరలోకపు తండ్రిని గురించిన కొన్ని మాటలను ఈ సందర్భములో ధ్యానము చేసుకుందాం.

## పరిశుద్ధ గ్రంధంలో పరలోకపు తండ్రి ప్రాధాన్యత:-

**1. దేవుడు వాక్యము ద్వారా మన ఆత్మలను కన్న తండ్రి:- యాకో 1:18** ఆయన తాను సృష్టించిన వాటిలో మనము ప్రధమ ఫలముగా ఉండునట్లు సత్యవాక్యము వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను.

**2. దేవుడు తన రక్తమిచ్చి మన ప్రాణాత్మ దేహములను కొన్న తండ్రి:- 1కొరింథీ 6:20** విలువ పెట్టి కొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి.

**అపో.కా 20:28** దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేని యందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి.

**3. పెంచే తండ్రి:- యెష 1:2**యెహోవా మాటలాడుచున్నాడు ఆకాశమా, ఆలకించుము, భూమీ, చెవియొగ్గుము. నేను పిల్లలను పెంచిగొప్ప వారినిగా చేసితిని వారు నా మీద తిరుగబడియున్నారు.

**4. పోషించు తండ్రి:- ద్వితీ 8:3** ఆహారము వలననే గాక యెహోవా సెలవిచ్చిన ప్రతి మాట వలన నరులు బ్రదుకుదురని నీకు తెలియజేయుటకు ఆయన నిన్ను అణచి నీకు ఆకలి కలుగజేసి, నీవే గాని నీ పితరులే గాని యెన్నడెరుగని మన్నాతో నిన్ను పోషించెను.

**ఎఫె 5:30** మనము క్రీస్తు శరీరమునకు అవయవములమైయున్నాము. గనుక ఆలాగే క్రీస్తు కూడ సంఘమును పోషించి సంరక్షించుచున్నాడు.

**5. ఎత్తికొని మోసే తండ్రి:-** ద్వితీ 1:31 ఐగుప్తులోను, అరణ్యములోను మీ కొరకు చేసినట్టు మీ పక్షముగా యుద్ధము చేయును, మీరు ఈ చోటికి చేరు వరకు మీరు వచ్చిన మార్గమంతటిలోను మనుష్యుడు తన కుమారుని ఎత్తికొనునట్లు మీ దేవుడైన యెహోవా మిమ్మును ఎత్తికొని వచ్చిన సంగతి మీరెరుగుదురని మీతో చెప్పితిని.

యెష 46:4 ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే తల వెండ్రుకలు నెరయు వరకు ఎత్తికొను వాడను నేనే, నేనే చేసియున్నాను. చంకపెట్టుకొను వాడును నేనే నిన్ను ఎత్తికొనుచు రక్షించువాడను నేనే.

**6. చెయ్యి పట్టుకొని నడక నేర్పు తండ్రి:-** హోషే 11:3 ఎఫ్రాయిమును చెయ్యి పట్టుకొని వానికి నడక నేర్పిన వాడను నేనే; వారిని కౌగిలించుకొనిన వాడను నేనే; నేనే వారిని స్వస్థపరచిన వాడనైనను ఆ సంగతి వారికి మనస్సున పట్టలేదు.

**7. మంచి యీవులను నిచ్చే తండ్రి:-** లూకా 11:11-13

మీలో తండ్రియైన వాడు తన కుమారుడు చేపనడిగితే చేపకు ప్రతిగా పామునిచ్చునా? గుడ్డు నడిగితే తేలునిచ్చునా? కాబట్టి మీరు చెడ్డవారై యుండియు, మీ పిల్లలకు మంచి యీవులనియ్య నెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగు వారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించుననెను.

**8. జాలి చూపే తండ్రి:-** కీర్త 103:13 తండ్రి తన కుమారుల యెడల జాలిపడునట్లు యెహోవా తనయందు భయభక్తులు గల వారి యెడల జాలిపడును.

**9. పిల్లలను ఆస్తి కర్తలుగా చేయును:-** 2కొరింథీ 12:14 ఇదిగో, యీ మూడవసారి మీ యొద్దకు వచ్చుటకు సిద్ధముగా ఉన్నాను. వచ్చినప్పుడు మీకు భారముగా నుండను. మీ సొత్తును కాదు మిమ్మునే కోరుచున్నాను. పిల్లలు తల్లిదండ్రుల కొరకు కాదు తల్లిదండ్రులే పిల్లల కొరకు కూర్చతగినది గదా.

సామె 8:21 నన్ను ప్రేమించు వారిని ఆస్తికర్తలుగా చేయుదును. వారి నిధులను నింపుదును.

**10. గొప్ప వారిని చేసే తండ్రి:-** యెష 1:2 యెహోవా మాటలాడుచున్నాడు ఆకాశమా, ఆలకించుము, భూమీ, చెవి యొగ్గుము. నేను పిల్లలను పెంచిగొప్ప వారినిగా చేసితిని వారు నా మీద తిరుగబడియున్నారు.

**11. తప్పు చేస్తున్నప్పుడు గద్దించే తండ్రి:-** సామె 3:12 తండ్రి తనకు ఇష్టుడైన కుమారుని గద్దించురీతిగా యెహోవా తాను ప్రేమించు వారిని గద్దించును.

**12. తప్పు చేసినప్పుడు శిక్షించే తండ్రి:-** హెబ్రీ 12:7-11 శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులనుగా మిమ్మును చూచుచున్నాడు తండ్రి శిక్షింపని కుమారుడెవడు? కుమాళ్లయిన వారందరు శిక్షలో పాలు పొందుచున్నారు. మీరు పొందని యెడల దుర్బీజులే గాని కుమారులు కారు. మరియు శరీర సంబంధులైన తండ్రులు మనకు శిక్షకులైయుండిరి. వారి యందు భయభక్తులు కలిగి యుంటిమి. అట్లయితే ఆత్మలకు తండ్రియైన వానికి మరి యెక్కువగా లోబడి బ్రదుకవలెను గదా. వారు కొన్ని దినముల మట్టుకు తమ కిష్టము వచ్చినట్టు మనలను శిక్షించిరి గాని మనము తన పరిశుద్ధతలో పాలు పొందవలెనని మన మేలు కొరకే ఆయన శిక్షించుచున్నాడు. మరియు ప్రస్తుత మందు సమస్త శిక్షయు దుఃఖకరముగా కనబడునే గాని సంతోషకరమగా కనబడదు. అయినను దాని యందు అభ్యాసము కలిగినవారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును.

**13. క్షమించే తండ్రి:- లూకా 15:18-20**

నేను లేచి నా తండ్రి యొద్దకు వెళ్లి – తండ్రీ, నేను పరలోకమునకు విరోధము గాను నీ యెదుటను పాపము చేసితిని. ఇక మీదట నీ కుమారుడనని అనిపించుకొనుటకు యోగ్యుడను కాను; నన్ను నీ కూలి వారిలో ఒకనిగా పెట్టుకొనుమని అతనితో చెప్పుదుననుకొని లేచి తండ్రి యొద్దకు వచ్చెను. వాడింక దూరముగా ఉన్నప్పుడు తండ్రి వానిని చూచి కనికరపడి పరుగెత్తి వాని మెడ మీద పడి ముద్దు పెట్టుకొనెను.

**కీర్త 86:5** ప్రభువా, నీవు దయాళుడవు క్షమించుటకు సిద్ధమైన మనస్సు గల వాడవు నీకు మొఱ్ఱ పెట్టు వారందరి యెడల కృపాతిశయముగలవాడవు.

**14. ముద్దు పెట్టుకొనే తండ్రి:- ఆది 27:26**

తరువాత అతని తండ్రియైన ఇస్సాకు నా కుమారుడా దగ్గరకు వచ్చి నన్ను ముద్దుపెట్టుకొమ్మని అతనితో చెప్పెను.

**యిర్మీ 31:20** ఎఫ్రాయిము నాకిష్టమైన కుమారుడా? నాకు ముద్దు బిడ్డా? నేనతనికి విరోధముగ మాటలాడి నప్పుడెల్ల అతని జ్ఞాపకము నన్ను విడువకున్నది. అతని గూర్చి నా కడుపులో చాలా వేదనగానున్నది, తప్పక నేనతని కరుణింతును; ఇదే యెహోవా వాక్కు.

**ముగింపు:-**

ఈ లోకంలో మన శరీర సంబంధులైన తండ్రులు ఏయే బాధ్యతలు మన పట్ల నిర్వర్తిస్తారో పరలోకపు తండ్రి కూడ అలాంటి బాధ్యతలే నిర్వర్తిస్తారు. ఇంకా చెప్పాలంటే మన శరీర సంబంధమైన తండ్రి కంటే మన ఆత్మలకు తండ్రియైన దేవుడు మరి నిశ్చయముగా ఏ లోపము లేకుండా మనలను పెంచి పోషించి గొప్ప వారినిగా చేయు దేవుడై యున్నాడు.

గనుక ఆ పరలోకపు తండ్రికి మన జీవితాలను ప్రాణాత్మ శరీరములను సజీవ యాగముగా సమర్పించుకుందాం. ఆయన ఆలనలో పాలనలో కొనసాగుదాం.

**అట్టి కృప ఆత్మ దేవుడు మనకందరికి అనుగ్రహించును గాక. ఆమేన్…**